క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

భువనగిరిటౌన్ : ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం పట్టణంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కూర వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఆలేరురూరల్ : మండలంలో సోమవారం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండ్రాజ వెంకటరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



భూదాన్‌పోచంపల్లి : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దంతూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సర్పంచ్ దోటి కుమార్‌యాదవ్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు గోరుకంటి ముత్యాలు, సిద్దగోని శివ తదితరులు మన్నె వెంకట్‌రెడ్డిలు ఆదివారం హైదరాబాద్‌లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, బోదాసు చిన్న ఈదయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు గోరుకంటి రవీందర్, సైదులు, రవీందర్ పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు గాజుల యాదగిరి ఆదివారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, ఎలగందుల కృష్ణ మూర్తి, ఎస్ కె రసూల్ , రాములు, ఏర్పుల వెంకటేశం, కాడిగల్ల రవి, ఇంజమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

బీబీనగర్: మండలంలోని పల్లెగూడెం గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి తన జీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం తన సోదరుడు గూడూరు జైపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సప్పిడి భారతమ్మసంజీవరెడ్డి, ఉప సర్పంచ్ జంగారెడ్డి, మాజీ సర్పంచ్ పల్లె యాదిరెడ్డి, నాయకులు సుధాకర్, అప్పిరెడ్డి, శ్రీధర్, దేవేందర్, భూపాల్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అడ్డగూడూరు : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం సభ్యులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మాపల్లె శంకర్, రాచకొండ రంగన్న, నరేందర్, గుండెల లింగస్వామి, సురేష్, సిద్దులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



బస్సు ఎక్కేందుకు క్యూ కట్టిన ప్రయాణికులు

భువనగిరి : భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం రాత్రి ప్రయాణికులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ముగుస్తుండడంతో యాదాద్రితో పాటు ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో బస్టాండ్ కిటకిటలాడింది. భువనగిరి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూసి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. దీంతో ఇదే అదునుగా ప్రైవేటు వాహనదారులు భువనగిరి నుంచి హైదరాబాద్‌కు రూ. 200లు వసూలు చేశారు.



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న భువనగిరి బస్టాండ్

మూణ్నాళ్ల ముచ్చటేనా!



మర్రిగూడెం గ్రామం వద్ద పగుళ్లు ఏర్పడి ధ్వంసం అవుతున్న బీటీ రోడ్డు



పగుళ్లు ఏర్పడుతున్న వంగపల్లి–మోటకొండూర్ రెన్యువల్ బీటీ రోడ్డు

- వంగపల్లి–మోటకొండూర్ రోడ్డుకు స్వల్పకాలానికే పగుళ్లు
- నాణ్యత పాటించలేదన్న విమర్శలు

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని వంగపల్లి బైపాస్ నుంచి మోటకొండూర్ మండలం మీదుగా ఆత్మకూరు మండలంలోని కప్రాయపల్లి వరకు ఇటీవల వేసిన బీటీ రోడ్డు స్వల్పకాలానికే ధ్వంసమవుతోంది. ఏడాది గడవక ముందే పగుళ్లు పట్టింది. రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవమే అందుకు కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.5.52 కోట్లతో నిర్మాణం

యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ బైపాస్ నుంచి మర్రిగూడెం, మహబూబ్‌పేటలను కలుపుకుని మోటకొండూర్ మీదుగా వర్టూర్, చందేపల్లి, పల్లెపహాడ్, ఆత్మకూరు మండలంలోని కప్రాయపల్లి వరకు 35.5 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు వేశారు. ఈ రోడ్డు రెన్యువల్‌కు ప్రభుత్వం రూ.5.52 కోట్లు విడుదల చేసింది. 2023 ఫిబ్రవరి 17న అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీత శంకుస్థాపన చేశారు.

అప్పుడే పాడైంది



వంగపల్లి–మోటకొండూర్ మండలానికి వెళ్లే ప్రధాన రహదారికి బీటీ వేసి ఏడాది కూడా కాలేదు. స్వల్పకాలానికే రోడ్డు ధ్వంసం అవుతుంది. కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోవడంతోనే రోడ్డు దెబ్బతింటుంది. అధికారులు కూడా పట్టించుకోలేదు.

– కసాగు సిద్దులు, ప్రయాణికుడు, మహబూబ్‌పేట

నాణ్యత పాటించలేదు.



కాంట్రాక్టర్‌లు నాణ్యత ప్రమాణాలను పాటించడం లేకపోవడంతో స్వల్పకాలానికే రోడ్డు పగుళ్లు పడుతుంది. అధికారులు కూడా పనులు పర్యవేక్షణ చేయడం మరిచినట్లు కనిపిస్తుంది. రోడ్డు వేసిన అనంతరం రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయడం కూడా మరిచిపోయారు.

– చేపూరి సత్తిరెడ్డి, మర్రిగూడెం

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు



భువనగిరి : పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

భువనగిరి : పట్టణంలోని శ్రీ పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాలేరు లక్ష్మణ్, పాదరాజు రాకేష్, పోతుగంటి వెంకటేశ్వర్లు, గురు స్వాములు, ఆలయ పూజారి కప్పగంతుల నాగరాజు శర్మ , అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

లక్ష బిల్వ పుష్పార్చన

భువనగిరి : పట్టణ శివారులోని మాసుకుంట పరిధిలో గల శ్రీ ఆంజనేయ స్వామి సహిత రాజరాజేశ్వరి ఆలయంలో ఆదివారం ఘనంగా సామూహిక లక్ష బిల్వ పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గడ్డం వెంకటయ్య అద్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు రాజకోటయ్య, సిద్దేశ్వర్, కృష్ణరావు, శ్యామ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్, కోశాధికారి చింత రాజు, గడ్డం శ్రీను, నీల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రాజాపేట : మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. ఆదివారం జై భీమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ. 5వేల నగదును అందజేశారు. రఘునాథపురం గ్రామానికి చెందిన గొర్ల బాలయ్య మృతి చెందగా వారి కుటుంబానికి ఎంపీటీసీ బుడిగె రేణుక పెంటయ్య గౌడ్ రూ. 5వేలు, ఉప సర్పంచ్ రూ. 5వేలు, బోయిని నారాయణ రూ. 5వేలతో పాటు 50కేజీల బియ్యాన్ని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జైభీమ్ అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కుపల్లి నవీన్, ఉపాధ్యక్షుడు భూపతి మహేష్ సంపత్, భాస్కర్, గణేష్, సిద్దిరాములు, నరేందర్, రాజు, శివ, రవీందర్, బాలకిషన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీమ్‌లో రెండు గ్యారంటీ స్కీమ్‌లు అమలు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకుడు బండారు ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో ఆదివారం సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నార్లకంటి రాంరెడ్డి, ఇట్టమొని మహేశ్, కారింగు శ్రీను, శ్రీకాంత్, గుండ్ల వేణు, పోచయ్య, రాజు, మునుకుంట్ల లక్ష్మణ్, మహేశ్, రవి,చంద్రయ్య, మీసాల స్వామి, బాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, రఘురాం, శ్రీశైలం, మోడెపు అశోక్, వీరస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోతో క్రమశిక్షణ, ఆత్మరక్షణ



మాట్లాడుతున్న శ్రీకాంత్

భువనగిరి : తైక్వాండో నేర్చుకోవడం వల్ల క్రమశిక్షణ, ఆత్మరక్షణ, మేధాశక్తి పెంపొందుతాయని తైక్వాండో జిల్లా అసోసియేషన్ జిల్లా ఇంచార్జి కోన్‌రెడ్డి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని దేదిప్య హైస్కూల్‌లో తైక్వాండో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైక్వాండోతో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. తైక్వాండోతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏదుగుదల, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. తైక్వాండో శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శేషగిరిరావు, డైరెక్టర్‌రంగరావు, శిక్షకుడు ఓరుగంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



బొమ్మలరామారం : పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

భువనగిరి రూరల్ : మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమంలో సీఐ శివశంకర్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు సల్ల పాండు, దాసోజు విశ్వరూప గురుస్వామి, యన్విడి నాగేశ్వర్ రావు , రాజా వెంకటేష్, చిగురుపల్లి రమేష్, చిగురుపల్లి చంద్రయ్య, రాములు, మొగుళ్ల భాస్కర్ రెడ్డి, మొలుగు లక్ష్మయ్య, పక్కిరు కొండల్ రెడ్డి, చిగురుపల్లి సోమయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో హరిహర పుత్ర అయ్యప్ప స్వామి పడిపూజను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సింగిరెడ్డి కృష్ణారెడ్డి , మోహన్, సర్పంచ్ బీరప్ప, ఉప సర్పంచ్ రాంరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మెన్ సింగిరెడ్డి మహీపాల్‌రెడ్డి, ఆంజనేయులు, సాయిరెడ్డి, నర్సింహ, శ్రీను, శివ, కిట్టు, భాను పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి దేవాలయంలో దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

చౌటుప్పల్ : కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని శ్రీసత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కోటి వత్తులు వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు కోటి వత్తులు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో వెన్‌రెడ్డి సంధ్య, ఉజ్జిని మంజుల, బొబ్బిళ్ల సంధ్యారాణి, వీసం నిర్మల, నలమల్ల కృష్ణవేణి, రజిత, లక్ష్మి, కీర్తన, శారద, రసజ్ఞ, సౌమ్య, ఝాన్సీ, అండాలు, నిర్మల, లక్ష్మి, శివాణి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

మునుగోడు: రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా పథకాలను ఆదివారం ఆయన మునుగోడులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రూ.10 లక్షల వరకు పేద కుటుంబాలకు చెందిన ప్రతిఒక్కరూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం పొందవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేసి అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీపీలు కర్నాటి స్వామి, తాడూరి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ గుత్తా ఉమా, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, ఎంపీడీఓ భాస్కర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

మర్రిగూడ: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి మునుగోడు అభివృద్ధికి తోడ్పడాలని ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకట్ల సుభాష్ అన్నారు. ఆదివారం గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామానికి చెందిన పలువురితో కలిసి చెర్వుగట్టులోని శ్రీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురిగి అంబికయాదయ్యగౌడ్, మహేశ్వరం వెంకటాచారి, మారోజు వెంకాచారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మర్రిగూడ: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మర్రిగూడ మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం మునుగోడులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మర్రిగూడ మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, చంద్రయ్య, అంజమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణ మహోత్సవం



వలిగొండ : కల్యాణమహోత్సవంలో తాళిబొట్టు చూపిస్తున్న వేదపండితులు



సంస్థాన్‌నారాయణపురం : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ : మండలంలోని సుంకిశాల గ్రామంలోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణానికి పారిశ్రామిక వేత్త పైళ్ల సంజీవ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ వేడుకల్లో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతి రమేష్ , వాకిటి పద్మా అనంత రెడ్డి, పైళ్ల రాజా వర్ధన్ రెడ్డి, నర్సింహ, చెరుకు శివయ్య, తుమ్మల యుగంధర్ రెడ్డి, బోళ్ల శ్రీనివాస్, పాశం సత్తి రెడ్డి, పైళ్ల ఉపేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని రాచకొండలోని ప్రాచీన లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో ఆదివారం రాచప్ప సమితి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకముందు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్తా ఉమాదేవి, ప్రేమ్ చందర్ రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గోవర్ధన్, రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్, సూరపల్లి వెంకటేశం, కడారి అంజిరెడ్డి, నిమ్మల నగేష్, శ్రీదేవి, శ్రీకాంత్, సాయి , కిషోర్, భాస్కర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చౌటుప్పల్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా బోధనలు చేసిన నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ చైర్మన్

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఆదివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రిని కలిసిన ఎంపీటీసీ

రామన్నపేట : ఆర్అండ్‌బీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం రామన్నపేట ఎంపీటీసీ, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర కార్య దర్శి వనం హర్షిణీచంద్రశేఖర్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలి పారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషిచేయాలి

భువనగిరి : మానవ హక్కుల పరిరక్షణకు కృషిచేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పహాడీనగర్‌లోని హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మానవ హక్కుల రక్షణ కోసం కృషి చేయడంతో పాటు మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర పీఆర్‌ఓ సయ్యద్ స్వేద ఇస్రత్ జూహన్, బాలల హక్కుల సంఘం నాయకులు వెంకటేష్, కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇస్తియాక్ అహ్మద్, ఉస్మాన్ అలీ అసీమ్, గౌసియా బేగం, షాహెదా భేగం, రఫియా సుల్తానా, మల్లీకా బేగం పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



ఇల్లు దగ్ధం

మునుగోడు: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడులోని జిట్టగోని మారయ్యకు చెందిన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కలవారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా అందులో గ్యాస్ సిలిండర్, విద్యుత్ వైర్లు ఉండడంతో భయపడ్డారు. దీంతో ఆ ఇంట్లో ఉన్న రూ. లక్షా 50వేల నగదు, 8 తులాల బంగారం, 60 తులాల వెండి తోపాటు సామగ్రి పూర్తిగా కాలి బూడిదయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అహంకారపు మాటలు మానుకోవాలి

చౌటుప్పల్ : బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పటికైనా తమ అహంకారపు మాటలు మానుకోవాలి డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం కొద్దిరోజులే అంటూ కుట్ర కోణంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఇతర నాయకులు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. తమ ప్రభుత్వానికి సంఖ్య ముఖ్యం కాదని, ప్రజల మద్దతు ముఖ్యమన్నారు. ఆయన వెంట తడక చంద్రకిరణ్, గోశిక రవీందర్, సత్యనారాయణ, భిక్షపతి, తడక అమర్, ఎండీ.అబ్దుల్‌రహీం, పబ్బు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) మండల అధ్యక్షుడు పి.శంకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి పాఠశాలకు పారిశుద్ధ్య కార్మికులను నియమించి పరిశుభ్ర వాతావరణంలో పిల్లలు చదువుకునే వాతావరణం కల్పించాలన్నారు.

వైభవంగా గాయత్రి యజ్ఞం

చౌటుప్పల్ : మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో సర్వేజన సుఖినోభవంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సోమ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సోమ జనార్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, యోగా గురువులు పాలకూర్ల పాండు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

'మహాలక్ష్మి'తో ఫుల్ ఖుషీ



రామన్నపేట : బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు



రామన్నపేట : నల్లగొండవైపు వెళ్తున్న బస్సు ఎక్కుతున్న మహిళలు

- మహిళలతో కిటకిటలాడుతున్న బస్సులు

రామన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే సౌకర్యం కల్పించడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఆదివారం రామన్నపేట బస్టాండ్ మహిళా ప్రయాణికులతో కిక్కిరిసింది. జనంపల్లి(రామన్నపేట) బాలికల గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లితండ్రులకు రెండవ ఆదివారం తమ పిల్లలను కలుసుకోవడానికి అనుమతిస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి తమ పిల్లలను చూడడానికి తల్లులు పెద్దసంఖ్యలో రావడం జరిగింది. వారికి పెళ్లిళ్ల శుభకార్యాలు, ఇతర పనులకు వెళ్లేవారు తోడవడంతో బస్టాండ్ ప్రాంగణం మహిళలతో కిటకిటలాడింది. బస్టాండ్‌లో ఉన్నవారిలో బస్సు ఎక్కేవారిలో 90శాతం మంది మహిళలే ఉన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ కనిపించారు. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వారి మోముల్లో ఆనందం కనిపిస్తుంది.

మహిళలకు ఎంతో మేలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మీ పథకం ఒకటి. మహాలక్ష్మీ పథకం మహిళలకు ఎంతో మేలు చేస్తుంది. ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఆర్థిక స్వావలంభనను సాధిస్తారు.పేద మద్య తరగతి మహిళలకు మహాలక్ష్మీ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ పథకంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

–గాదె శోభారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు